సాక్షి జగిత్యాల

శనివారం, 4, మార్చి, 2023



అంగన్‌వాడీల ఆందోళన

జగిత్యాలటౌన్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు మూడోరోజూ ఆందోళన చేశారు.



అర్హులకే 'డబుల్' ఇళ్లు

జగిత్యాల: అర్హులకే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలనే డిమాండ్‌తో బీజేపీ ఆధ్వర్యంలో మహిళలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వెంకన్నకు క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం క్షీరాభిషేకం వైభంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని రంగు రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ హవన కార్యక్రమం చేపట్టారు.

నేడు పసుపు సాగుపై సదస్సు

జగిత్యాలఅగ్రికల్చర్: లక్ష్మీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతిలో పసుపు సాగుపై శనివారం ఉదయం 9గంటలకు రైతు సదస్సు నిర్వహించనున్నారు. 'పసుపు సాగు– మార్కెటింగ్ పద్ధతులు'అంశంపై నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన కల్పిస్తారు. స్పైస్ బోర్డు, నాబార్డు అధికారులు, పొలాస శాస్త్రవేత్తలు హాజరవుతారు.

ప్రతిష్టాత్మకంగా 'కంటి వెలుగు'



వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

కోరుట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఏసికోని గుట్ట 23వ వార్డులో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలువురికి కళ్లద్దాలు అందజేశారు. ఆర్డీవో వినోద్ కుమార్, డీఎంహెచ్‌వో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి పాల్గొన్నారు.

ఎస్పీ భాస్కర్‌కు అభినందన



భాస్కర్, ఎస్పీ

జగిత్యాలజోన్: ఎస్పీ భాస్కర్‌ను డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం రాత్రి అభినందించారు. వివిధ జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో డీజీపీ హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఇటీవల నియమితులైన ఎస్పీలు తమ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లు, గ్రామాలను సందర్శించాలని డీజీపీ ఆదేశించారు. దీంతో ఎస్పీ భాస్కర్ బాధ్యతలు చేపట్టాక 14 పోలీస్‌స్టేషన్లు, 3 గ్రామాలు సందర్శించారు. ఫిర్యాదుదారులతోనూ మాట్లాడారు. గ్రామస్తులతోనూ మమేకమయ్యారు. సత్వరమే స్పందిస్తున్న ఎస్పీ భాస్కర్‌ను డీజీపీ ఈసందర్భంగా అభినందించారు.

బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు రక్ష



శ్రావణికి కండువా కప్పుతున్న బండి సంజయ్

జగిత్యాల: తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసేవాళ్ల ఇళ్లు ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగా కూల్చివేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరించారు. ఇటీవల బీజేపీలో చేరిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణితో ఆమె నివాసంలో శుక్రవారం భేటీ కాషాయ కండువా కప్పారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో అత్యాచారాలు, హత్యల కేసులు నీరుగారుస్తున్నారని, దోషులకు శిక్షలు ఎందుకు పడటం లేదనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని కోరారు. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం తెలంగాణలో నేరాల సంఖ్య 17 శాతం పెరిగిందని అన్నారు. ఎక్కువ శాతం బీఆర్ఎస్ వాళ్లే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. వీటికి నిరసనగా ఈనెల 6న ఆందోళనలు చేపడతామని తెలిపారు. వంట గ్యాస్ ధర పెంపుపై అనవసర ఆందోళనలు చేస్తున్నారన్నారు. చైతన్య కళాశాల విద్యార్థి సాత్విక్‌ను చిత్రహింసలు పెట్టి చంపితే బయటకు చెప్పవద్దని అతడి దోస్తులను భయపెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.

పర్యవేక్షణ లోపం.. పనులు నాసిరకం



- ఇది మెట్‌పల్లి బస్‌డిపో చౌరస్తాలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్. లీకేజీల మరమ్మతు కోసం 15రోజుల క్రితం గుంత తవ్వారు. ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. నీటి వృథాతో ఆ ప్రాంతం బురదగా మారింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. నాసిరకంగా పనులు చేయడంతో పైపులకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

- 'మిషన్ భగీరథ'కు తరచూ లీకేజీలు
- మరమ్మతుల్లోనూ తీవ్ర జాప్యం
- మున్సిపల్‌వాసులకు తప్పని తిప్పలు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం పైపులైన్లు నిర్మించారు. వాటి ద్వారా ఆవాసాలకు తాగునీరు అందిస్తున్నారు. అయితే, చాలా ప్రాంతాల్లో పనులు పూర్తికాలేదు. ప్రజలకు భగీరథ తాగునీరు అందడం లేదు. పనులు ఇంకా పూర్తికాక ముందే పైపులకు ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఈసమస్య అధికంగా ఉంది.

రూ.43కోట్లతో పనులు

- బల్దియాలో సుమారు రూ.43కోట్లతో మిషన్ భగరీథ పనులు చేపట్టారు.
- వీటితో పలుచోట్ల స్టోరేజీ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు, నల్లాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు.
- మున్సిపల్‌లో 26వార్డులుండగా, వీటిల్లో 102 కి.మీ. పొడవున పైపులైన్ నిర్మించారు.
- మొత్తం 12వేల ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 11,850 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.
- నల్లా కనెక్షన్లు ఇచ్చినా చాలా ఇళ్లకు ఇంకా తాగునీటిని సరఫరా చేయడం లేదు.
- వాటర్‌గ్రిడ్ నుంచి నీటి సరఫరా లేకపోవడమే కారణమని చెబుతున్నారు.

లీకేజీలతో నీరు వృథా..

మెట్‌పల్లిలోని చాలాచోట్ల పైపులకు లీకేజీలు ఏర్పడుతున్నాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోందనే విమర్శలున్నాయి. ఒక ప్రాంతంలోని లీకేజీలకు మరమ్మతు చేస్తుండగానే మరోచోట లీకేజీల వుతున్నాయి. లీకేజీలకు తక్షణమే మరమ్మతు కూడా చేయడంలేదు. తాగునీరు వృథా అవుతోంది.

నిర్లక్ష్యం తగదు



భగీరథ పైపులకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతులు చేపట్టే విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. రోజుల తరబడి జాప్యం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను నాణ్యతగా చేయకపోవడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి.

– ఖుత్బుద్దీన్, మైనార్టీ నాయకుడు

ఫిర్యాదులు వస్తున్నాయి



భగీరథ పైపుల లీకేజీలతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. లీకేజీలు ఎక్కడ ఏర్పడ్డా వెంటనే అధికారుల దృష్టికి తీసుకుపోతున్నాం. జాప్యం చేయకుండా మరమ్మతు చేపట్టాలని సూచిస్తున్నాం.

– అరుణ్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్

లీకేజీలపై నిర్లక్ష్యం

- చావిడి రోడ్డు ఖబ్రస్తాన్ వద్ద పైపులైన్ లీకేజీలు ఏర్పడితే రెండు నెలలుగా పట్టించుకోలేదు. దీనిపై ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురిత కావడంతో స్పందించిన అధికారులు వెంటనే మరమ్మతు చేశారు.
- మరమ్మతుల కోసం గుంతలు తవ్వుతున్న సిబ్బంది ప్రమాదాలు జరుగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదు.
- 12వార్డులో ఇటీవల తవ్విన గుంతలోకి కారు దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు.
- మిగతా నాలుగు మున్సిపాలిటీల్లోనూ మిషన్ భగీరథ పరిస్థితి ఇలాగే కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..



సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి,



ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ..

- మానకొండూర్ నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగిన రేవంత్‌యాత్ర
- 15 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజలతో మమేకమైన కాంగ్రెస్ చీఫ్
- మానకొండూర్ సభలో బీఆర్ఎస్ నేతలపై నిప్పులు

తిమ్మాపూర్/మానకొండూర్: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం నుంచి శుక్రవారం ప్రారంభమైన యాత్ర మానకొండూర్ వరకు ఉత్సాహంగా సాగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు రేవంత్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఊరూరా కార్యకర్తలు, ప్రజలు, మహిళలు రేవంత్‌కు ఘనస్వాగతం పలికారు. మొగిలిపాలెంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి సుస్మితారమణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. పర్లపల్లి వరకు బైక్‌ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి పోలంపల్లికి చేరుకొని మధ్యాహ్నం 12.30 గంటలకు గ్రామశివారులో భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభంకాగా 7 గంటల వరకు మానకొండూరు చేరారు. సుమారు 15 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. మధ్యలో మల్లాపూర్‌లో సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి ఇంట్లో టీ విరామం తీసుకున్నారు. మన్నెంపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ చేశారు. పోరండ్లలో బొజ్జ లచ్చవ్వ తన భర్త ఐదేళ్ల క్రితం చనిపోయినా.. తన పేరున భూమి మార్పిడి జరగడంలేదని రేవంత్‌కు విన్నవించింది. సాక్షర భారత్ కోఆర్డినేటర్లను విధుల్లో నుంచి తొలగించినందుకు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తాము అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సెక్యూరిటీ అత్యుత్సాహం

పాదయాత్ర భోజన విరామ సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ అత్యుత్సాహం చూపించారు. ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మీడియా ప్రతినిధులతో దురుసుగా మాట్లాడారు. బౌన్సర్ల నిర్లక్ష్యంతో ఓ దప్పు కళాకారుడికి స్వల్ప గాయాలయ్యాయి. తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి వద్ద గీకురు నర్సయ్యను రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. సాయంత్రం ఏడుగంటలకు మానకొండూర్‌లో సభ నిర్వహించారు.

అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తాం

మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొందరు బీఆర్ఎస్ వాళ్లు కాంగ్రెస్ ఏం చేసిందని మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంటు అందించామని అన్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు జాతీయ రహదారి, ఔటర్‌రింగురోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మీరు ఇప్పుడు సెల్ఫీలు దిగుతున్న శిల్పారామం కాంగ్రెస్ కట్టిందేనని కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ.. ఎద్దేవా చేశారు. రెండుసార్లు అవకాశం ఇస్తే రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్, మానకొండూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తనకన్నా ముందు ముగ్గురు ఎంపీలు కరీంనగర్ నుంచి ప్రాతినిధ్యం వహించారని, వారు పదిశాతం కూడా అభివృద్ధి చేయలేదని అన్నారు. ఒకవేళ తనకన్నా ఎక్కువ అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని పొన్నం సవాల్ విసిరారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూర్ వరకు రహదారి నిర్మాణం తమ పోరాటమే అని గుర్తు చేశారు. రసమయిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్యరావు థాక్రే, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, అంజనికుమార్ యాదవ్, వేణుగోపాల్, మానకొండూర్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, శంకర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఆగమేఘాలపై ఏర్పాట్లు
- మట్టి, ఇసుకతో రోడ్లు చిత్తడి
- ఇబ్బందులు పడుతున్న భక్తులు



బ్రహ్మోత్సవాలకు రావాలని అర్చకుడిని ఆహ్వానిస్తున్న అధికారులు



పుట్టబంగారం వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అయితే, రెండుమూడ్రోజుల ముందే ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాలు జారీచేసినా అధికారులు పెడచెవిన పెట్టారు. దీంతో అసౌకర్యాల మధ్య వేడుకలు ప్రారంభించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఒకవైపు భక్తుల రాక, మరోవైపు రోడ్లపై పనుల్లో జేసీబీలతో అవస్థలు తప్పలేదు. పట్టణ అభివృద్ధిలో పనుల్లోనూ నిర్లక్ష్యం భక్తులకు శాపంగా మారింది.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు..

- ఈనెల 15వ తేదీవరకు నిర్వహించే నృసింహుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.
- తొలిరోజు పుట్ట బంగారంతో ఆలయ అధికారులు వేడుకలు ప్రారంభించారు.
- అధికారులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తొలుత ఉదయం పట్టంలోని అర్చకుడి నివాసానికి మేళతాళాలతో చేరుకున్నారు.
- సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలు సమర్పించి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు.
- ఆ తర్వాత అందరూ ఆలయానికి చేరుకుని కలశస్థాపన తదితర పూజలు చేశారు.
- సాయంత్రం పుట్టబంగారం వేదిక వద్దకు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు.
- అక్కడ స్వామివారికి వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు.
- ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెనోవేషన్ కమిటీ సభ్యుడు ఇందారపు రామయ్య సమక్షంలో మృత్ సంగ్రహణం(పుట్ట బంగారం) వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- బంగారంతో సమానమైన పుట్టమట్టిని తవ్వి ఆలయానికి తీసుకొచ్చారు.
- ఆ తర్వాత భక్తులకు దానిని పంచిపెట్టారు.
- ఈ కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, కూతురు నందిని, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణ మహోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన స్వామివారి కల్యాణ వేడుకలను శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిపిస్తారు. ఈమేరకు శేషప్ప కలావేదికపై అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాలేకాదు.. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి సుమారు 50వేల మందికిగా పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేశారు.

గోదావరిలో నామమాత్రపు సౌకర్యాలు..

గోదావరి నదిలో నీటి మట్టం అధికంగా ఉంది. భక్తులు ప్రమాదాల బారినపడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా గోదావరి నదిలో భక్తులు స్నానాలు చేసేందుకు లోనికి వెళ్లకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కానీ, సంతోషిమాత ఘాట్‌కే ఇనుప రాడ్‌తో తాడు కట్టారు. మంగళిగడ్డ ప్రాంతంలో ఏర్పాట్లు చేయలేదు. స్నానం కోసం వచ్చి ఓ యువతి ఇటీవల ఇక్కడే నీట మునిగి మృతి చెందింది.

మోదీ పాలనలో పేదలపై ఆర్థికభారం



జగిత్యాలలో బీఆర్ఎస్ శ్రేణుల వంటావార్పు



ఎండపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట..

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- వంట గ్యాస్ పెంపుపై బీఆర్ఎస్ నిరసన

జగిత్యాలటౌన్: ప్రధాని మోదీ పాలనలో పేదలపై ఆర్థికభారం మోపుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ స్థానిక తహసిల్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తొలుత కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రపంచ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గితే మనదేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచితే రాష్ట్రప్రభుత్వం భరించాలనడం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, నాయకులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

సామాన్యులపై గుదిబండ

వెల్గటూర్(ధర్మపురి): పెరుగుతున్న వంటగ్యాస్ ధర సామాన్యులపై గుదిబండగా మారిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ విమర్శించారు. ఎండపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టారు. రమణ మాట్లాడుతూ, నిత్యావసరాల ధరల పెంపుతో పేదలు ఆర్థికభారం మోయలేకపోతున్నారన్నారు. నాయకులు సింహాచలం జగన్, జలేందర్‌రెడ్డి, కంది లావణ్య, గందం లక్ష్మీనారాయణ, నస్యూరి మల్లేశం, గాదం భాస్కర్, గందం రమణయ్య, గంగాధరి శేఖర్ పాల్గొన్నారు.

ధర నిర్ణయించేది వ్యాపారులే!

- అభాసుపాలవుతున్న 'ఈ-నామ్'
- తూతూమంత్రంగానే 'ఆన్‌లైన్' కొనుగోళ్లు
- అన్నదాతలకు అందని ప్రతిఫలాలు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఆన్‌లైన్ పద్ధతిన దిగుబడులు కొనుగోలు చేసే పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో 'ఈ-నామ్' పేరిట దీనిని 14 ఏప్రిల్ 2016లో ప్రవేశపెట్టింది. కానీ, క్షేత్ర స్థాయిలో పంటల ధరలను స్థానిక వ్యాపారులే నిర్ణయిస్తున్నారు. తద్వారా ఈ-నామ్ ఫలాలు అన్నదాతలకు అందడం లేదు. జగిత్యాల, మెట్‌పల్లి, గొల్లపల్లిలో ఈ-నామ్ మార్కెటింగ్ వ్యవస్థ అందుబాటులో ఉన్నా పెద్దగా ప్రయోజనాలు ఏమీ చేకూరడంలేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ-నామ్ ఎందుకు ప్రవేశపెట్టారంటే..

- మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొచ్చిన ఉత్పత్తులకు అధిక ధర పలికేలా, వ్యాపారుల్లో పోటీతత్వం ఏర్పడేలా, కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ఈ -నామ్ మార్కెటింగ్ వ్యవస్థను కేంద్రప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.
- ఇందుకోసం కంప్యూటర్లు సమకూర్చి, ఆపరేటర్లను నియమించారు.
- దీనిద్వారా పంట ఉత్పత్తులను స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల వ్యాపారులూ కొనుగోలు చేసే అవకాశం ఉంది.
- ఈ విధానంలో క్రయవిక్రయాలను ఆన్‌లైన్‌లో ఈ-బిడ్డింగ్ పద్ధతిలో నిర్వహిస్తారు.
- దీంతో రైతులు మార్కెట్లో అడుగు పెట్టినప్పటి నుంచి వ్యాపారులు సరుకులు కొనుగోలు చేసి, రైతులు బయటకు వెళ్లే వరకు ఈ-ఎంట్రీ, ఈ-టెండరింగ్, ఈ -పేమెంట్, ఈ-పర్మిట్.. ఇలా అన్ని రకాల ప్రక్రియలు ఆన్‌లైన్ పద్ధతిలోనే కొనసాగిస్తారు.

క్షేత్రస్థాయిలో స్థానిక వ్యాపారులే దిక్కు..

ఈ -నామ్ పద్ధతి అమలులోఉన్న మార్కెట్లలో పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు స్థానిక వ్యాపారులే దిక్కయ్యారు. రైతులు మార్కెట్‌యార్డుకు పంట ఉత్పత్తులు తీసుకురాగానే, కమీషన్ ఏజెంట్లు ఈ-ఎంట్రీ పద్ధతిలో తమ దుకాణానికి ఎంతసరుకు వచ్చిందనే విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. తర్వాత, మధ్యాహ్నం 12 గంటల వరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులు యార్డుల్లో తిరిగి, ఓ కాగితంపై రేటు రాసుకుని, ఆ ధరను ఈ-టెండరింగ్‌లో నమోదు చేయిస్తున్నారు. దీంతో, ఎప్పటి మాదిరిగానే వ్యాపారుల్లో పోటీ లేకపోవడంతో రైతులకు ఆశించిన స్థాయిలో ధర లభించడం లేదు. ఉదాహరణకు.. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో 55 మంది వరకు కొనుగోలుదారులు ఉండగా, అందులో ఐదారుగురు వచ్చి, ఏదో ఓ ధరను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆ ధరను కమీషన్ ఏజెంట్లు రైతులకు చెప్పడంతో, 'మా ఖర్మ' అనుకుంటూ, అదే ధరతోనే సంతృప్తి చెందుతున్నారు. స్థానిక వ్యాపారుల్లో సైతం పోటీ లేకపోవడం, బయటి వ్యాపారులు అసలు ఈ-నామ్‌లో పాలుపంచుకోకపోవడంతో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఆశించిన లక్ష్యాలు నేరవేరడం లేదు. పంట ఉత్పత్తుల్లో నాణ్యత పరీక్షించే పరికరాలు, వసతులు లేవు. తేమశాతం, మట్టి, పక్వంరాని ధాన్యం, చెడిపోయిన, రంగు మారిన ధాన్యం శాతం ఏ మేరకు ఉందనే విషయాలను మార్కెట్ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ, ఈ -నామ్ మార్కెట్లలో ఈ వసతులేమీ లేవు.



జగిత్యాలలోని ఈ-నామ్ మార్కెట్ కార్యాలయం

ఫలాలు అందడం లేదు

జిల్లాలో ఈ-నామ్ ప్రారంభించి నాలుగేళ్లు గడిచినా.. ఒక్కరైతు ధాన్యం కూడా ఇతర రాష్ట్రాల వ్యాపారులు కొనుగోలు చేసేంది లేదు. ఏదో తూతూ మంత్రంగానే ఈ -నామ్ పద్ధతి నడిపిస్తున్నారు. ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడితేనే రైతులకు మంచి ధర వస్తుంది.

– పడిగెల రవీందర్, రైతు, రాయికల్

త్వరలో ల్యాబ్‌ల ఏర్పాటు

జిల్లాలోని జగిత్యాల, గొల్లపల్లి, మెట్‌పల్లి ఈ -నామ్ మార్కెట్ యార్డుల్లో ఉత్పత్తుల నాణ్యత పరీక్షించే ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నాం. ఆన్‌లైన్ కొనుగోళ్ల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నాం. పంట ఉత్పత్తులను ఈ-టెండరింగ్ ద్వారానే కొనుగోలు చేస్తున్నారు.

– ప్రకాశ్, మార్కెటింగ్ జిల్లా అధికారి

క్లుప్తంగా

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజమ్మ



గొల్లపల్లి (ధర్మపురి): వైఎస్సార్‌టీపీ నుంచి ధర్మపురి నియోజకవర్గం సింగిల్ కో ఆర్డినేటర్ (ఇన్‌చార్జి)గా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన మోకెనపెల్లి రాజ మ్మను నియమిస్తూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. రాజమ్మ 2009లో ఎమ్మార్పీఎస్ నుంచి ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు. వైఎస్సార్ అభిమాని అయిన రాజమ్మ జగన్మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్ సీపీలో 12 ఏళ్లుగా సీనియర్ నాయకురాలిగా పనిచేశారు. వైఎస్సార్‌టీపీలో చురుకైన నాయకురాలిగా పార్టీకి సేవలందించారు. ధర్మపురి నియోజకవర్గం నుంచి ఇద్దరు పోటీపడగా రాజమ్మకు అవకాశం వరించింది..

ఎన్‌ఆర్‌ఐ పాలసీని అమలు చేయాలి

మల్లాపూర్ : గల్ఫ్ వెళ్లిన లక్షలాది కార్మికుల సంక్షేమం కోసం ఎన్‌ఆర్‌ఐ పాలసీని అమలు చేయాలని ఇండియన్ పీపుల్స్ ఫోరమ్ నాయకులు పెనుకుల అశోక్ అన్నారు. శుక్రవారం దుబాయిలో ఇండియన్ పీపుల్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం గల్ఫ్ కార్మికులకు భరోసా కల్పించేందుకు మార్చి 5న దుబాయికి చేరుకోనున్నారని, ఎంపీ అరవింద్ సభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇండియన్ పీపుల్స్ ఫోరం నాయకులు శరత్, నవనీత్, హరీశ్ పటేల్, గోవర్ధన్, యాదవ్, దశరథ, అజయ్, అశ్విత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు నేడు బహిరంగ వేలం

జగిత్యాల : జగిత్యాల స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల వారు జగిత్యాలలోని ధరూర్ క్యాంప్‌లో గల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 9 గంటకునుంచి హాజరు కావాలన్నారు.

అంగన్‌వాడీల సమ్మెబాట

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మూడోరోజూ తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెగడపల్లి (ధర్మపురి): అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిబ్బంది సమ్మెబాట పట్టారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె మూడోరోజూ కొనసాగింది. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు సమ్మె చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నూతన జాతీ య విధానం రద్దు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు చెల్లింపు, పింఛన్ సౌకర్యం వర్తింపు, ఉద్యోగ భద్రత, 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనం, అంగన్‌వాడీ టీచర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750 ఏరియర్స్‌ను ప్రభుత్వం చెల్లించాలి. టీచర్లతో సమానంగా వేతనం, పెన్షన్స్, ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలి. ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన విద్యావిధానాన్ని రద్దుచేయడంతో పాటు 2017 నుంచి టీఏ, డీఏ బకాయిలు మొత్తం చెల్లించాలి. హెల్త్ కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు, ప్రమాద బీమా సౌకర్యం తదితర డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు పూనుకున్నారు. జిల్లావ్యాప్తంగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. మల్యాల, ధర్మపురి, మెట్‌పల్లి, జగిత్యాలలో ప్రాజెక్టులుండగా వీటి పరిధిలో 1065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రఏర్పాటు తర్వాత డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీ సిబ్బంది పలుమార్లు సమ్మెచేశారు. సీఎం కేసీఆర్ స్పందించి సమస్యల పరిష్కారానికి హామీఇచ్చారు. కానీ హామీలు నెరవేరకపోవడంతో మరోసారి సమ్మెకు దిగారు. 2017 నుంచి టీఏ, డీఏలు, ఇంక్రిమెంట్లు. అలవెన్స్‌తో పాటు 2018లో కేంద్రం పెంచిన వేతనాలు నేటికి చెల్లించడం లేదని వారు వాపోతున్నారు. మరోవైపు ఏళ్ల తరబడి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా తమపై పనిభారం మోపుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు.

హామీలు నెరవేర్చాలి



అంగన్‌వాడీల సమస్యల పరిష్కార కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. సీఎం కేసీఆర్ తమ సమస్యలు పరిష్కరిస్తారని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం తమపై చిన్నచూపు చూడకుండా ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలి.

– రజిత అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

సమ్మెను ఉధృతం చేస్తాం



అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కంచకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం. పనికి తగిన వేతనం చెల్లించడం లేదు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కార్యాచరణ రూపొందిస్తాం.

– రాజలింగు, సీఐటీయూ జిల్లా కో కన్వీనర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఐసీడీఎస్‌లతో పాటు ఇతర శాఖల సేవలు అందిస్తున్న తమపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను ఎత్తివేసేందుకు సర్కారు కుట్ర పన్నుతోంది. ప్రభుత్వం త్వరగా సమస్యలు పరిష్కరించాలి.

–జయప్రద, అంగన్‌వాడీ టీచర్

'ట్రినిటీ'లో ఆకట్టుకున్న యూత్ ఫెస్ట్ మేధా–23



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ లెవల్ యూత్ ఫెస్ట్ మేధా–23ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్ ఫిలిమ్స్, క్విజ్ తదితర పోటీలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- నర్సింహులపల్లె, కందెనకుంట గ్రామాల్లో విస్తృత పర్యటన



కందెనకుంటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం కందెనకుంట, నర్సింహులపల్లె గ్రామాల్లో మీరు–నేను కార్యక్రమంలో భాగంగా ఉదయం పర్యటించారు. నర్సింహులపల్లెలో గురువారం రాత్రి పల్లెనిద్ర చేసిన అనంతరం ఉదయం గ్రామంలోని కాలనీలు, వార్డుల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. అనంతరం రూ.2.80 లక్షలతో ఏర్పాటు చేసిన పిండిగిర్ని, రూ.5 లక్షలతో నిర్మించే చేసే యాదవ సంఘ భవనం, రూ.15 లక్షలతో ఏర్పాటు చేసే సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొల్ముల రమణ, ముక్క శంకర్, ఎంపీటీసీ ఎడ్ల సృజనా సుశీన్, సర్పంచులు రిక్కల ప్రభాకర్, ఆసునూరి భీమక్క, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ, విద్యుత్ చార్జీలపై సమాధానమివ్వాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



విలేకరులతో మాట్లాడుతున్న తుల ఉమ

మెట్‌పల్లి: వంటగ్యాస్ ధరల పెంపుపై మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు ముందుగా రాష్ట్రంలో పెంచిన ఆర్టీసీ, విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ డిమాండ్ చేశారు. మండలంలోని చౌలమద్దిలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు సామాన్య, మధ్యతరగతి ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటు చేసుకునే పరిణామాల వల్ల గ్యాస్ ధరల్లో హెచ్చుతగ్గులుంటాయని, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు బీజేపీని ఇరకాటంలో పెట్టాలని చూస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

'అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న నాయకులు

ధర్మపురి : తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి వెంచర్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల సర్పంచులు, గ్రామస్తులు డిమాండు చేశారు. ధర్మపురికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని రామయ్యపల్లె, తిమ్మాపూర్ గ్రామాల మధ్య పంచాయతీల అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. తక్కువ ధరకు కొనగోలు చేసి వెంచర్ పేరుతో ప్లాట్లు ఏర్పాటు చేసి అమాయకుల నుంచి లక్షలు దండుకుంటున్నారని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు కాల్ల శేఖర్, మెడపట్ల దుబ్బయ్య ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తే గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలని, కానీ ఇందుకు విరుద్ధంగా పంట కాలువలను ధ్వంసం చేసి వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ కస్తూరి నాగభూషణం, నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఆవునూరి శ్రీకాంత్, ఆడెపు ప్రసాద్, జగన్, ప్రేమ్‌సాగర్, తదితరులున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులను అభినందిస్తున్న రాధరెడ్డి

జగిత్యాల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌ఈఆర్‌టీ, ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో జగిత్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్‌ఈఆర్‌టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ రాధారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. జగిత్యాల జిల్లా రాంసాగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న ఎల్.విజయ్ ద్వితీయ స్థానం, తాటిపల్లి హైస్కూల్‌లో చదువుతున్న బి.వైష్ణవి తృతీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు నగదును అందజేశారు. విద్యార్థులను డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, రాజశేఖర్, మధుసూదన్, మచ్చ రాజశేఖర్, రమేశ్, చంద్రశేఖర్, నాగార్జున అభినందించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే దంపతులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేటలో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ అగ్గిడి భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లావణ్య–నర్సయ్య దంపతులు, ఉపసర్పంచ్ ఎండీ.అమినొద్దీన్, సీని యర్ నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాభివద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలి



రాయికల్ ఠాణాలో ఎస్పీ భాస్కర్

జగిత్యాలజోన్: పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలని ఎస్పీ భాస్కర్ కోరారు. జిల్లా కేంద్రంలో అన్ని పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్ పోలీసుకానిస్టేబుళ్లకు శుక్రవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. పోలీస్‌లు అంటే భయపడుతూ, పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కేందుకు జంకేవారికి అండగా ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉండాలని కోరారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా చదివి, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. విధుల్లో ప్రతిభ కనబరిచే రిసెప్షనిస్టులకు అవార్డులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రాజు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్, డీసీఆర్బీ, ఐటీ కోర్, రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి

రాయికల్(జగిత్యాల): శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఠాణా పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై కిరణ్‌కుమార్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మేడిపెల్లి ఠాణా పరిశీలన

మేడిపెల్లి(వేములవాడ): ఎస్పీ భాస్కర్ స్థానిక పోలీసుస్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రాజు తదితరులు ఉన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

కథలాపూర్(వేములవాడ): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్బీ సీఐ రాజశేఖర్‌రాజు, కోరుట్ల సీఐ ప్రవీణ్, ఎస్సై రామచంద్రం ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హాత్‌సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ

జగిత్యాలటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం హాత్ సే హాత్ జోడోయాత్ర నిర్వహించారు. పట్టణంలోని 23, 24, 25 వార్డుల మీదుగా 39వ వార్డు వరకు ఈ యాత్ర సాగింది. అనంతరం ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. లింగంపేటలో జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సి లిండర్‌ను అందజేస్తామని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులపై భారం మోపుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో గడీల పాలన అంతానికే హాత్‌సే హాత్ జోడో యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మెగా హెల్త్ క్యాంప్

కోరుట్ల రూరల్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన 15 మంది వైద్యుల బృందం ఈ హెల్త్ క్యాంపులో పాల్గొంటారన్నారు. పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీతో పాటు చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తల్వార్‌తో వీరంగం

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



శంకర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి మండలం.. కొండ్రికర్లలో జన్నా శంకర్ అనే వ్యక్తి శుక్రవారం తల్వార్‌తో వీరంగం సృష్టించాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ వర్గానికి చెందిన వారితో గ్రామస్తులకు కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. గ్రామంలో నిర్వహించే జాతరపై చర్చించేందుకు శుక్రవారం మల్లన్న ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. కాగా శంకర్ అనే వ్యక్తి తల్వార్‌తో అక్కడికి చేరుకొని మరోవర్గంపై దాడికి యత్నించాడు. భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు అక్కడి నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి చెందిన నేమూరి లింబయ్య ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శ్యాం రాజ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీకి చెందిన వేముల ప్రదీప్ (28) ధర్మపురిలో చేపడుతున్న డివైడర్ పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకొని తనతో పాటు నగునూర్‌కు చెందిన సెందిల్‌తో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మండలంలోని రాయపట్నం బస్టాండ్ వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన సెందిల్‌ను జగిత్యాలలోని ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై కిరణ్‌కుమార్ చేరుకొని మృతుని సేకరించారు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య గౌతమి ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్ : భూ తగాదాల వివాదంలో ఒకరిపై దాడి చేసిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కంచ ప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిళ్ల మురళి కథనం ప్రకారం..సారంగాపూర్ మండలం పెంబట్ల–కోనాపూర్ అనుబంధ గ్రామం పోచంపేటలో కొమురోజు రాంచంద్రం, బ్రహ్మచారి మధ్య భూ వివాదం నడుస్తుంది. సెప్టెంబర్ 30, 2009న రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రాంచంద్రంపై బ్రహ్మచారి కర్రతో దాడి చేయడంతో ఆస్పత్రికి తరలించారు. బ్రహ్మచారితో పాటు ఆయనకు సహకరించిన మరో ఇద్దరిపై సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసి నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ ఆఫీసర్స్ కిరణ్‌కుమార్, రామకృష్ణ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో ప్రధాన బ్రహ్మచారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అయితే, ఈ కేసులో ప్రధాన ముద్దాయికి సహకరించిన ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసును తొలగించారు.

పార్ట్ టైం స్వీపర్‌కు విరాళం

కథలాపూర్ : మండలంలోని ఊటుపెల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పార్ట్ టైం స్వీపర్‌గా పని చేసి పదవి విరమణ పొందిన పులి ఆంజనేయులకు గ్రామస్తులు రూ.53 విరాళంగా అందించారు. శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పులి ఆంజనేయులు 34 ఏళ్లుగా పాఠశాలలో పార్ట్ టైం స్వీపర్‌గా పనిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు. 34 ఏళ్లుగా పనిచేసినా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందకపోవడంతో గ్రామస్తులు రూ.53 వేలు సమకూర్చి ఆంజనేయులకు అందించారు. ఎంఈవో ఆనందరావు, సర్పంచ్ గజ్జెల స్వామి, ఎంపీటీసీ రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ ఏజీబీ మహేందర్, ఏజీబీ గణేశ్, హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

మల్యాల: మండలంలోని నూకపల్లి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం ముత్యంపేటలోని దిగువ కొండగట్టులో నిర్వహించారు. 1987-88 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు 35 ఏళ్ల కలుసుకున్నారు. అనంతరం పాఠశాలల చదివిన జ్ఞాపకాలను వారు నెమరువేసుకొని ఆట పాటలతో సందడి చేశారు.